

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

» కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఓటరు జాబితాను మరోమారు పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్ రావు, నోడల్ అధికారులు, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు.



మహిళలకు వడ్డీలేని రుణాల రాయితీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పం

» సర్కారు తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి
» కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి
» అట్టహాసంగా మహిళా సంఘాలకు రుణాల పంపిణీ

బోధన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత సాధనలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. బోధన్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు మంగళవారం బోధన్ పట్టణంలోని రోటరీ భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో వడ్డీలేని రుణాల చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సెగ్మెంట్ పరిధిలోని 3703 సంఘాలకు వడ్డీలేని రుణాల రూపేణా ప్రభుత్వం రూ.4.28కోట్ల నిధులను వారి ఖాతాలలో జమచేసింది.

మిగతా 8వ పేజీలో...



మోగిన 'పంచాయతీ' నగారా



జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేసింది. మూడు దశల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. డిసెంబరు 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 27 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నారు.

జిల్లాలో మూడు విడతల్లో ఇలా..

మొదటి విడతలో..
బోధన్, చందూరు, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవిపేట మండలాలకు చెందిన 184 గ్రామ పంచాయతీలు, 1642 వార్డులకు మొదటి విడతలో డిసెంబరు 11న పోలింగ్ జరగనుంది.

రెండో విడతలో..
ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లోని జక్రాన్‌పల్లి మంలాలకు చెందిన 196 గ్రామ పంచాయతీలు, 1760 వార్డు సభ్యులకు డిసెంబరు 14న పోలింగ్ జరగనుంది.

మూడో విడతలో..
ఆలూరు, ఆర్మూర్, బాల్కొండ, భీంగల్, డొంకేశ్వర్, కమ్మర్‌పల్లి, మెండోర, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట, వేల్పూర్, ఏర్గట్ల మండలాలకు చెందిన 165 గ్రామ పంచాయతీలు, 1620 వార్డులకు డిసెంబరు 17న పోలింగ్ జరగనుంది.

» సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదల
» జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ
» డిసెంబరు 11, 14, 17 తేదీలలో పోలింగ్
» ఏర్పాట్లలో అధికార యంత్రాంగం
» నేటి నుంచి అమలులోకి ఎన్నికల కోడ్

నిజామాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. డిసెంబరు 11, 14, 17 తేదీలలో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో మూడు విడతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలోని బోధన్, నిజామాబాద్, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించనున్నారు. డిసెంబరు 11న మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల పోలింగ్, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. రెండో విడత నామినేషన్లు నవంబరు 30 నుంచి స్వీకరిస్తారు. డిసెంబరు 14న రెండో విడత సర్పంచ్, వార్డు సభ్యుల పోలింగ్ అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. మూడో విడత నామినేషన్‌లు డిసెంబరు 3 నుంచి స్వీకరిస్తారు. డిసెంబరు 17న మూడో విడత సర్పంచ్, వార్డు సభ్యుల పోలింగ్ అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలకాగా మంగళవారం నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది.


బ్యాలెట్ పత్రాలు సిద్ధం..

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసింది. 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులకుగాను 5053 పోలింగ్ కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించే ఎన్నిక కోసం ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశారు. సర్పంచ్ స్థానానికి పోటీపడే అభ్యర్థులకు గులాబీ రంగు బ్యాలెట్ పత్రాన్ని, వార్డు సభ్యుల కోసం తెలుపు రంగు బ్యాలెట్ పత్రాన్ని ముద్రించారు. జిల్లాలో జంబో బ్యాలెట్ పెట్టెలు 2531, చిన్న బ్యాలెట్ పెట్టెలు 1380లు అందుబాటులో ఉండగా ఇప్పటికే వాటిని మొదటి విడత పోలింగ్ జరిగే మండలాలకు తరలించారు. మొదటి విడత పోలింగ్ పూర్తయిన తర్వాత వాటిని 2వ విడత, ఆతర్వాత 3వ విడత పోలింగ్ జరిగే మండలాలకు తరలిస్తారు.

మొదటి విడత..
నవంబరు 27న నోటిఫికేషన్ విడుదల
నవంబరు 29 వరకు నామినేషన్ల స్వీకరణ
నవంబరు 30న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల జాబితా ప్రకటన
డిసెంబరు 1న అభ్యంతరాల స్వీకరణ
డిసెంబరు 2న అభ్యంతరాల పరిష్కారం
డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ
అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన

రెండో విడత..
నవంబరు 30న నోటిఫికేషన్ విడుదల
డిసెంబరు 2 వరకు నామినేషన్ల స్వీకరణ
డిసెంబరు 3న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల జాబితా ప్రకటన
డిసెంబరు 4న అభ్యంతరాల స్వీకరణ
డిసెంబరు 5న అభ్యంతరాల పరిష్కారం
డిసెంబరు 6న నామినేషన్ల ఉపసంహరణ
అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన

మూడో విడత..
డిసెంబరు 3న నోటిఫికేషన్ విడుదల
డిసెంబరు 5 వరకు నామినేషన్ల స్వీకరణ
డిసెంబరు 6న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల జాబితా ప్రకటన
డిసెంబరు 7న అభ్యంతరాల స్వీకరణ
డిసెంబరు 8న అభ్యంతరాల పరిష్కారం
డిసెంబరు 9న నామినేషన్ల ఉపసంహరణ
అదేరోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన



మాజీల మౌనం

నియోజకవర్గాలవైపు వెళ్లని బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు

» పార్టీ కార్యక్రమాలకు దూరంగా బీఆర్ఎస్ నేతలు
» ఇతర పార్టీలవైపు ద్వితీయ శ్రేణి నాయకుల చూపు
» బీఆర్ఎస్‌లో కనిపించని 'స్థానిక' సందడి
» అయోమయంలో పార్టీ క్యాడర్

పదేళ్లపాటు అధికారాన్ని అనుభవించిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు అధికారం పోయి రెండేళ్లు గడుస్తున్నా నియోజకవర్గాల వైపు చూడడంలేదు. ఉన్న కొద్దిమంది క్యాడర్‌ను సైతం నియోజకవర్గాలలో పలకరించేవారే కరువయ్యారు. బాల్కొండ నియోజకవర్గంలో ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఉండడంతో ఆయన వెంట క్యాడర్ అలానే ఉంది. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో మాత్రం మాజీ ప్రజాప్రతినిధులు చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారు. శుభకార్యాలు, పరామర్శలకే తప్ప.. పార్టీ కార్యక్రమాలకు అంటిముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. దీంతో పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి నెలకొంది.

నిజామాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ప్రస్తుతం గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటుంది. ఒకవైపు రాష్ట్రమంతా స్థానిక ఎన్నికల జోష్‌లో ఉండగా బీఆర్ఎస్‌లో మాత్రం ఆ జోష్ కనిపించడంలేదు. ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో బీఆర్ఎస్ పరిస్థితి దారుణంగా ఉంది. సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా.. ఆ పార్టీకి గ్రామాల్లో పోటీ చేసే అభ్యర్థులు దొరికే పరిస్థితి లేదంటే ఆ పార్టీ పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. జిల్లాలో 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో గెలుపొంది 2014లో పార్లమెంట్ సీటును సైతం గెలుచుకున్న బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్ ఉండేది. 2023 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోంది. జిల్లాలో కేవలం బాల్కొండ నియోజవర్గంలో మాత్రమే బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండగా.. మిగిలిన నాలుగు నియోజకవర్గాలలో రెండు నియోజకవర్గాల్లో బీజేపీ, రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మాత్రమే ద్వితీయ శ్రేణి నాయకులు అధికార కాంగ్రెస్ వైపు వెళ్లలేదు. మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో ద్వితీయశ్రేణి క్యాడర్ అంతా అధికార కాంగ్రెస్, జిల్లాలో బలంగా ఉన్నా బీజేపీ వైపు వెళ్లారు. మిగిలి ఉన్న కొంతమంది స్థానిక ఎన్నికల రిజర్వేషన్‌లను బట్టి ఏ పార్టీలో టికెట్ వస్తే ఆ పార్టీవైపు వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు. నిజామాబాద్ అర్బన్, ఉమ్మడి జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు బీజేపీ వైపు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తిగా ఉన్న మాజీ ప్రజాప్రతినిధులు ఇప్పటి నుంచే ఇతర పార్టీలలోకి వెళితే ఎన్నికల నాటికి క్యాడర్ సెట్ అవుతుందనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ

మిగతా 8వ పేజీలో...

గ్రామాల్లో ఆసక్తి చూపని అభ్యర్థులు..

అధికారంలో ఉన్నపుడు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు సభ్యుల స్థానాలకు బీఆర్ఎస్‌లో పోటీకి ఎక్కువ మంది ఆసక్తి చూపేవారు. ఒక్కో స్థానానికి పదిమందికి పైగా అభ్యర్థులు ఉన్నా పరిస్థితి నుంచి ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంది. పార్టీలో ఉన్న నేతలు సైతం పోటీకి ఆసక్తి చూపడంలేదు. ఓడిపోయే పరిస్థితిలో పోటీ చేయడం ఎందుకని ద్వితీయశ్రేణి నాయకులు ఆలోచిస్తున్నారు. పార్టీ క్యాడర్‌ను దగ్గరికి తీసుకునే నాయకులు లేకపోవడంతో ఉన్న నాయకులు సైతం ఇతర పార్టీలవైపు చూస్తున్నారు. ఇప్పటికే చాలావరకు బీఆర్ఎస్ శ్రేణులు అధికార కాంగ్రెస్, బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఉన్న కొంతమంది మాత్రం పార్టీని అంటిపెట్టుకుని ఉన్నా.. వారిని పట్టించుకునే నాయకులే కరువయ్యారు.

విద్యార్థి మృతి ఘటనలో ప్రిన్సిపాల్ సస్పెన్షన్

» విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ముగ్గురు సిబ్బందిపై వేటు

నిజామాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చందూరులోని నిజామాబాద్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్-3లో సోమవారం పదో తరగతి విద్యార్థి షేక్ మూసా ఆత్మహత్య ఘటనలో ప్రిన్సిపాల్ టి.నరేష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా మైనార్టీ అధికారి కృష్ణవేణి ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా ఎకనామిక్స్ జూనియర్ లెక్చరర్ వి.నవీన్‌కుమార్, టీజీటీ సోషల్ స్టడీస్ అతిఫా నస్రీన్, సెక్యూరిటిగార్డు సాయిలులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు అధికారులు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ, మిగతా ముగ్గురు సిబ్బందిపై వేటు వేశారు.

విద్యను కాషాయీకరిస్తున్న మోదీ ప్రభుత్వం

» సీనియర్ జర్నలిస్టు, రచయిత పాశం యాదగిరి
» ఘనంగా పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభలు
» నగరంలో విద్యార్థుల భారీ ర్యాలీ



అభివాదం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, ముఖ్య అతిథులు

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రైవేటీకరణ, కాషాయీకరణ వైపు తీసుకెళ్తుందని కవి, రచయిత, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ అధ్యక్షతన మంగళవారం 23వ మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాశం యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాల్సిందిపోయి మతోన్మాదాన్ని, మూఢనమ్మకాలను పెంచి పోషించే విధానాలను తీసుకువస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత కేసీఆర్ ప్రభుత్వంలానే విద్యారంగానికి అన్యాయం చేస్తుందన్నారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. దోపిడి పీడనలు లేని సమసమాజస్థాపన కోసం శాస్త్రీయ విద్య లక్ష్యంగా 50 ఏళ్లుగా పీడీఎస్‌యూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. విద్యార్థి

మిగతా 8వ పేజీలో...

సైబర్ నేరగాళ్ల వేధింపులే అధికం

» తగ్గిన గృహహింస, వరకట్న వేధింపులు
» అదనపు డీసీపీ బస్వారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ బస్వారెడ్డి

ఇందూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో గృహహింస, వరకట్న వేధింపులు తగ్గుముఖం పట్టాయని సైబర్ నేరగాళ్ల వల్లనే ఎక్కువ బాధపడుతున్నారని అదనపు డీసీపీ బస్వారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్, సఖి వన్‌స్టాప్ సెంటర్, మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల ట్రాన్స్‌జెండర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ.. అనవసర యాప్‌లు వాడడం, వ్యక్తిగత సమాచారాన్ని మొబైల్ ఉంచడం ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను, అనవసర యాప్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు.

మిగతా 8వ పేజీలో...



పరిహారం విడుదల

» 17కోట్ల 88లక్షల 4661 రూపాయల పంట నష్టం విడుదల చేసిన ప్రభుత్వం

నిజామాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గత ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు పంట నష్ట పరిహారం కింద ప్రభుత్వం నుంచి 17కోట్ల 88లక్షల 4661 రూపాయలు విడుదలైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జిల్లాలో 17వేల 630 ఎకరాలకు సంబంధించి 17కోట్ల 63లక్షల 1250 రూపాయల పంట నష్ట పరిహారం విడుదలైందని అదేవిధంగా అక్టోబరు నెలలో జరిగిన పంటనష్టంకు సంబంధించి 250 ఎకరాలకు సంబంధించిన 25లక్షల 3411 రూపాయల నష్టపరిహారం విడుదలైనట్లు తెలిపారు.

సృజన వెలికితీతకే వైజ్ఞానిక ప్రదర్శన

» బోధన్‌లో అలరించిన సైన్స్‌ఫెయిర్
» 520 ప్రాజెక్టులు తయారుచేసిన విద్యార్థులు
» విద్యార్థులకు డీఈవో అశోక్ సందేశం



6

మనల్ని ఎవడ్రా ఆపేది..?

» ఆర్మూర్‌లో వాహనదారుల ఇష్టారాజ్యం
» రెడ్ సిగ్నల్ ఉన్నా ఆగని వైనం
» తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు
» పట్టించుకోని అధికారులు

6

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

7

క్రైం సమాచారం

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

నందిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతూర్‌లో నివాసం ఉంటున్న పల్లికొండ మేఘన అలియాస్ ధనలక్ష్మి(30) అనే వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జి.శ్యామ్‌రాజ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మేఘనకు నందిపేటకు చెందిన సతీష్‌తో 9 ఏళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు పుట్టకపోవడంతో ఆమెను భర్త సతీష్, అత్త రాజమణి వేధించేవారు. దీంతో మనస్థాపం చెందిన మేఘన సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలి తండ్రి డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఏర్రోళ్ల పోశెట్టి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త హత్య.. భార్యలకు రిమాండ్

భీమ్‌గల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవక్కపేట్‌లో భర్తపై పెట్రోల్ పోసి హత్య చేసిన ఇద్దరు భార్యలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేవక్కపేట్‌కు చెందిన మలావత్ మోహన్ తాగుడుకు బానిసై నిత్యం ఇద్దరు భార్యలు సంగీత, కవితను వేధించేవాడు. అది భరించలేక సోమవారం ఉదయం ఇంటిఆవరణలో నిద్రపోతున్న మోహన్‌పై వారు పెట్రోల్ పోసి నిప్పంటించడంతో అక్కడిక్కడే మృతిచెందారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా.. పథకం ప్రకారమే హత్య చేసినట్లు అంగీకరించారు. పోలీసులు నిందితులిద్దరిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

కారుకు నిప్పంటించిన దుండగులు

ధర్పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో సబ్ స్టేషన్ వద్ద పార్కింగ్ చేసి ఉంచిన కారును గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించగా పూర్తిగా కాలిబూడిదైంది. రెండు నెలల వ్యవధిలో నాలుగు ద్విచక్ర వాహనాలతో పాటు తాజాగా గ్రామానికి చెందిన చెలిమెల రంజిత్‌కు చెందిన కారును గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. పార్కింగ్ చేసి ఉంచిన వాహనానికి నిప్పంటించడంతో పరిసర ప్రాంతంలో ఉన్న గ్రామస్థులు యజమానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌హెచ్‌వో కళ్యాణి సంఘటనాస్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

ఇందల్వాయి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి స్టేషన్ పరిధిలో మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా అమర్లబండకు చెందిన దత్తురావు, ఆరేపల్లికి చెందిన మల్లేష్ పట్టుబడడ్డారని ఎస్సై సందీప్ తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా జుడిషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి అహ్మద్ 7 రోజుల జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

ముప్కాల్: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన కేసులో ఒకరికి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గంగాధర్ 4రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన మారుతి నాగరావును కోర్టులో హాజరుపర్చగా ఆయనకు సాధారణ జైలుశిక్ష విధించారన్నారు.

సుభాష్‌నగర్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి జైలు శిక్ష, 18 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. మంగళవారం 25 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చగా.. 18 మందికి రూ.10వేల చొప్పున జరిమానా, ఏడుగురికి వారం జైలు శిక్ష విధించారన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి సెకండ్‌క్లాస్ మెజిస్రెట్ గట్టు గంగాదర్ మంగళవారం జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆర్మూర్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహించగా మామిడిపల్లికి చెందిన శ్రీనివాస్, పట్టణానికి చెందిన రాజన్న, వన్నెల్(కే)కు చెందిన రాజేశ్వర్, సత్తుపల్లికి చెందిన అజయ్, లక్కోరాకు చెందిన వెంకటరమణ మద్యం తాగి పట్టుబడ్డారన్నారు.వారికి కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొకరికి రూ.10 వేల జరిమానా విధించారని వివరించారు.

భార్యకు వేధింపులు.. భర్తపై కేసు

బీర్కూర్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్‌కు చెందిన ఓ వివాహితను తన భర్త అదనపు కట్నం కోసం తీవ్రంగా వేధిస్తున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఏడేళ్ల క్రితం గోపాల్‌పేట్‌కు చెందిన జగపతికి వీరాపూర్‌కు చెందిన మహిళతో వివాహమైంది. రెండేళ్లుగా అదనపు కట్నం కోసం జగపతి తన భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా.. జగపతిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

బీర్కూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరిని రిమాంట్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండలకేంద్రంలో ఈనెల 17న సంజీవ్ ఇంట్లో చోరీ జరిగింది. నాలుగున్నర తులాల బంగారు, 13తులాల వెండి ఆభరణాలు, రూ.2.50లక్షల నగదును చోరీ చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు, బాలుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో చోరీ చేసినట్లు అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు.



రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్తున్న వాహనదారులు

- ఆర్మూర్‌లో వాహనదారుల ఇష్టారాజ్యం
- రెడ్ సిగ్నల్ ఉన్నా ఆగని వైనం
- తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

మనల్ని ఎవడ్రా ఆపేది..!

పెర్కిట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రంగా పెరిగిపోతోంది. పట్టణంలోని మామిడిపల్లి, అంబేద్కర్ చౌరస్తా, దొండి మెడికల్ కూడళ్ల వద్ద వాహనదారులు నిబంధనలు పాటించకుండా నేరుగా వెళ్తున్నారు. ఆ సమయంలో మరోవైపు నుంచి వాహనాలు వచ్చినప్పుడు వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఎవరో ఒకరు గాయపడుతూనే ఉన్నారు. పట్టణంలోని కూడళ్ల వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కెమెరాలు పనిచేయక పోవడం, ట్రాఫిక్ పపోలీసులు లేకపోవడంతో వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు.

సీసీ కెమెరాలుంటే జర భయం..

వాహనదారులు రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఆగకుండా వెళ్తున్నారు. సిగ్నల్స్ వద్ద కెమెరాలు పనిచేసినట్లయితే ఆగకుండా వెళ్లిన వారికి జరిమానా విధించే అవకాశం ఉంటుంది. కానీ పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఈ విషయం తెలిసిన వారు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. పట్టణంలో పెరుగుతున్న వాహనాలు, ట్రాఫిక్‌తో పాదచారులు, వాహనదారులు రోడ్డుకు ఒకవైపు నుంచి మరొక వైపు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణ ఉంటే వాహనదారులు అదుపులో ఉంటారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోజూ ఇబ్బందులు పడుతున్నాం..

పట్టణంలో సోమవారం, బుధవారం మార్కెట్, వారాంతంలో ట్రాఫిక్ మరీ ఎక్కువవుతోంది. ఒక చోటు నుంచి మరొక చోటికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ట్రాఫిక్ పోలీసులుంటే వాహనదారులు అదుపులో ఉంటారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- అమర్‌నాథ్, స్థానికుడు

త్వరగా సమస్యను పరిష్కరిస్తాం



పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయని సం దర్భంలో వీలైనంత త్వరగా హైదరాబాద్ నుంచి టెక్నీషియన్‌ను పిలిపించి బాగుచేయిస్తున్నాం. ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల కొన్ని ప్రాంతాల్లో పర్యవేక్షించలేకపోతున్నాం. ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. సిగ్నల్స్ వద్ద సీసీ కెమె రాలను ఏర్పాటుచేసే విషయంలో పై అధికారులకు తెలియజేశాం. వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తాం. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- రఘుపతి, ట్రాఫిక్ ఎస్సై, ఆర్మూర్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రెంజల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజలుప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని నీలా గ్రామంలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ స్వేచ్ఛాయుతంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై చంద్రమోహన్, పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిధులు వచ్చేశాయ్..!

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- కాల్వల మరమ్మతులకు నిధుల మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డొంకేశ్వర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు నీరందించే కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని అక్టోబరు 31న 'ఆంధ్రజ్యోతి'లో 'కాల్వ బాగు చేస్తేనే చివరికి నీరు' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ప్రతిపాదనలు పంపగా.. రూ.48 లక్షల నిధులు మంజూరు చేశారు. వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ కూడా పూర్తవుతుందని డీఈఈ రవికుమార్ తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి అవగానే మూడు నెలల్లో కాల్వలకు మరమ్మతులు చేపడతామన్నారు. మారంపల్లి స్టేజ్ 2 నుంచి 5కిలోమీటర్లు సీసీ కాలువతో పాటు కాల్వలో పేరుకుపోయిన చెట్లను తొలగించనున్నారు.

రోడ్ల పనులు షురూ

ఆలూర్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గగ్గుపల్లి, దేగాం గ్రామంలో కాంగ్రెస్ నేతలు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరయ్యాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ముత్యంరెడ్డి, రామాగౌడ్, ప్రభాకర్, మల్లేష్, సాయన్న, గంగాధర్, పద్మరావు, ఆకాష్, శశి సాయన్న, పెద్ద రాజన్న, శంకర్, సురేష్ తదితరులున్నారు.

రూ.6.33 కోట్ల వడ్డీ రాయితీ

- మహిళా సంఘాలకు పంపిణీ చేసిన అదనపు కలెక్టర్ అంకిత్



మహిళా సంఘాల సభ్యులకు రాయితీ చెక్కును అందజేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, అధికారులు

మోర్తాడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ నియోజకవర్గంలోని మహిళా స్వయం సంఘాలకు రూ.6.33 కోట్ల విలువైన వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిందని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. మండల కేంద్రంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల రాయితీని అదనపు కలెక్టర్ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, స్త్రీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తున్నారని పేర్కొన్నారు అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో మహిళా సంఘ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం వంటి ఎన్నో పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేశారన్నారు. ఒకప్పుడు నామమాత్రపు రుణాలు అందేవని ప్రస్తుతం ఒక్కో సంఘానికి రూ.20లక్షలకు పైగా రుణాలు ఇస్తున్నామన్నారు. ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వీటిని కూడా మహిళలు చక్కగా నిర్వహిస్తున్నారని ప్రసంసించారు. కార్యక్రమంలో డీపీఎం రాజేశ్వర్, ఎంపీడీవో తిరుమల, ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చెన్న, ఏఎంసీ డైరెక్టర్లు మహిపాల్, నజీద్, ముత్యాల రాములు, ఐకేపీ ఏపీఎంలు శ్యాం, మాణిక్యం, గంగాధర్, కిరణ్, సమీరా, గంగారాం, గంగరాజు, హిమబాల, సీసీలు పడకల శ్రీనివాస్, సంతోష్‌కుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



వడ్డీ రాయితీ చెక్కు అందజేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

అతివలు ఉన్నతంగా నిలవాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని, జీవితంలో ఉన్నత స్థాయిలో నిలవాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మహిళా స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాల రాయితీని పంపిణీ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మహిళలు తీసుకున్న రుణాలకు వడ్డీ లేని రాయితీలను అందించామని మహిళా సంఘాల జిల్లా అధికారిణి సంధ్యరాణి తెలిపారు. జిల్లాలో 19,026 సంఘాలకు రూ.23.25 కోట్ల రాయితీని అందజేసినట్లు వివరించారు. ఆర్మూర్ నియోజకర్గంలో 3180 సంఘాలకు రూ.3.25 కోట్ల రాయితీ వచ్చిందన్నారు. సంఘ సభ్యులు రుణం పూర్తిగా చెల్లించిన తర్వాత వారి ఖాతాల్లో డబ్బులు నేరుగా జమ అవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



రామన్నపేట్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

వేల్పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ వారి కుటుంబాల యోగక్షేమాలను తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రామోజీరావ్, శంకర్, ప్రస్తుత హెచ్‌ఎం శివాజీని సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు చేయూతగా రూ.3లక్షలను అందజేశారు.

స్వేచ్ఛాయుతంగా ఓటేయాలి

జక్రాన్‌పల్లి , నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ సూచించారు. మంగళవారం మండలంలోని మనోహరాబాద్‌లో ఎస్సై జి.మహేష్ కలిసి పర్యటించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ఓటేయాలన్నారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను బెదిరించడం, గుంపులుగా తిరిగి ఉద్రిక్తత సృష్టించడం, ప్రత్యర్థులపై దాడులకు దిగితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు వ్యాప్తి చేయడం చట్టవిరుద్ధమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిచ్‌పల్లి సీఐ వినోద్

అభివృద్ధిలో బాన్సువాడది మొదటిస్థానం

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సొసైటీ సబ్ సెంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మోస్రా,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉంటుందని ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి చందూర్ మండల కేంద్రంలోని చెరువులో ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం మేడిపల్లిలో సొసైటీ గోదాం, లక్ష్మాపూర్‌లో సొసైటీ సబ్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో నీలావతి, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, కర్రం సాయిరెడ్డి, చందూర్, మోస్రా, వర్ని మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.







బోధన్‌లో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్‌లో మాట్లాడుతున్న డీఈవో అశకోక్ - రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు - రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులు

సృజన వెలికితీతకే వైజ్ఞానిక ప్రదర్శన

- బోధన్‌లో అలరించిన సైన్స్ ఫెయిర్
- 520 ప్రాజెక్టులు తయారుచేసిన విద్యార్థులు
- విద్యార్థులకు డీఈవో అశోక్ సందేశం



రాష్ట్రస్థాయి బహుమతి అందుకుంటున్న మాక్లూర్ పాఠశాల బృందం

బోధన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనలతో సాంకేతికత వృద్ధి చెందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని విజయమేరి పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిలో ప్రేరణ కలిగిస్తూ భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి వైజ్ఞానిక సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, విద్యాశాఖ అధికారి నాగయ్య, రాజి మంజూషలతో మండలాల విద్యాధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలన్నింటికి ఆధునిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించవచ్చని పలువురు విద్యార్థులు చాటి చెప్పారు. రహదారి ప్రమాదాలు నివారించేందుకు వాహనాలకు ఆటోమెటిక్ బ్రేక్ సిస్టం, నగరాలలో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయంలో కీటకాల ముప్పును నివారించేందుకు సోలార్ ప్రాపర్, వరదల వేళ విద్యుత్‌కు గురవ్వకుండా తీసుకోవాల్సిన సాంకేతిక పరిజ్ఞానం, విద్యుత్ ఆదా చేసేలా స్మార్ట్ సిటి ప్రణాళికలు ఇలా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఔరా అనిపించాయి. సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన 520 వైజ్ఞానిక ప్రదర్శనలు ఉన్నాయి. సుస్థిర అభివృద్ధి, లాభాదాయకమైన కూరగాయల పంటల సాగు, సోలార్ వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగించే సాధనలు, కాలుష్య నియంత్రణ, ఆరోగ్యకర ఆహారం వంటి వివిధ అంశాలపై ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించారు.

కాలుష్యం లేకుండా గ్రావెటీ కార్



ప్రజలు కాలుష్యం బారిన పడకుండా భూమిలోని అయస్కాంతంతో గ్రావిటీ కారును తయారుచేశారు ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. డీజీల్, గ్యాస్ కాకుండా గ్రావెటీ కార్లను రూపొందిస్తే రూపొందిస్తే కాలుష్యాన్ని నియంత్రించవచ్చని విద్యార్థులు జే.అంజని, ఎం.గాయత్రి తెలియజేశారు.

- ప్రాజెక్ట్ ప్రదర్శన, యూపీఎస్ ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఆధునిక టెక్నాలజీ పైజా ఎలక్ట్రిసిటీ



ఆధునిక టెక్నాలజీ పైజా ఎలక్ట్రిసిటీ పరిజ్ఞానంతో ఇంట్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించవచ్చని, దీంతో అనేక లాభాలు ఉంటాయని విద్యార్థులు అక్షర, రుతిక తెలిపారు. విద్యుత్‌తో ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు. వరదల వల్ల ప్రమాదాలు చోటు చేసుకోకుండా అరికట్టవచ్చని ప్రదర్శనలో వివరించారు.

- డిచ్‌పల్లి పాఠశాల విద్యార్థులు

రెయిన్ సెన్సార్ క్లాత్ ప్రొడెక్టర్



నీటి సంరక్షణ, నిర్వహణపై మోస్రా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ వైజ్ఞానిక ప్రదర్శనలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. రెయిన్ సెన్సార్ క్లాత్ ప్రొడెక్టర్ ద్వారా నీటి సంరక్షణ నిర్వహణ గురించి వివరించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని విద్యార్థినులు అక్షయ, స్వాతి వివరించారు.

- మోస్రా విద్యార్థులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో రామకృష్ణ

డొంకేశ్వర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు సురేష్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ పోటీలను 2రోజులపాటు నిర్వహించనున్నారు.విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయికుమార్, గంగారెడ్డి, సాయిలు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందించాలి

కోటగిరి,నవంబరు25(ఆంధ్రజ్యోతి): చిన్న రైతులకు ఎలాంటి లింకులు లేకుండా ఎరువులు అందించాలని పోతంగల్ మండల రైతులు కోరారు. పోతంగల్ రైతు వేదికలో మంగళవారం ఏఈవో సుప్రియకు వినతిపత్రం అందజేశారు. పోతంగల్ విశాల పరపతి సంఘం ఆధ్వర్యంలో ఎరువులు విక్రయిస్తూ లింకు పెట్టడం రైతులకు మరింత భారం అవుతుందన్నారు. సన్న, చిన్నకారు రైతులకు ఎలాంటి లింకు లేకుండా ఎరువులు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు భజరంగ్ హన్మాండ్లు హన్మాండ్లు, సాగర్, దత్తు తదితరులున్నారు.

సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ

భీమ్‌గల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బోధన్‌లో నిర్వహించిన జిల్లా స్థా యి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో పట్టణంలోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాల విద్యార్థిని మోడల్ బెస్ట్ ఆన్ గ్రీన్ ఎనర్జీ అనే అంశంలో రెండో బహుమతి సాధించింది. దీంతో విద్యార్థినిని, గైడ్ శ్రీనివాస్, సైన్స్ ఎగ్జిబిషన్ ఇన్‌చార్జి స్వర్ణను పాఠశాల అధ్యక్షుడు బసంత్‌రెడ్డి, ఏవో నర్సారెడ్డి అభినందించారు.



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న దృశ్యం

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

రెంజల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యకారులకు చేప పిల్లలను అందజేశారు. సుమారు 3 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రవీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్, యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్ యాదవ్, మండల అధ్యక్షుడు గైని కిరణ్, శ్రీను, రవి, వెంకటి, షబ్బీర్, అసాని అనిల్, ఇందిరా, సాయాగౌడ్, గంగాధర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ అబ్బోల్ల శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంఘం నిర్మాణ పనులకు భూమిపూజ


సంఘం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పిట్లం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బేడ బుడగ జంగం కాలనీలో మంగళవారం ఎంపీ నిధులతో నిర్మించిన బేడ బుడగ జంగం సంఘం భవన నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. పార్టీ కిసాన్ సెల్ అధ్య క్షుడు మాట్లాడుతూ.. బేడ బుడగ జంగం కాలనీలో గతంలో నిర్మించిన సంఘ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని పూర్తికూల్చివేసి, అదే స్థలంలో రూ.10లక్షల ఎంపీ నిధులతో సంఘం నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. తొలి విడుతలో విడుదలైన రూ.5 లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు హనుమాండ్లు, విండో ఛైర్మన్ శపథం రెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు చంద్రశేఖర్, ఇమ్రోజ్, శివ, మోయిన్, సూరత్ రెడ్డి, రవి, దయానంద్, కాలనీవాసులు నాయకులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం



బీర్కూర్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

బీర్కూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 50 మందికి పైచిలుకు కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించారు. గ్రామస్థులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మోతెబిందు ఉన్నవారికి బోధన్ లయన్స్ ఆస్పత్రికి, మధుమేహం ఉన్నవారికి బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, లయన్స్ సభ్యులు విఠల్, రషీద్, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కానుకగా ఇందిరమ్మ చీరలు


మేనూరులో చీరలు పంపిణీ చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు

మద్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పేరిట మహిళలకు కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుందని మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దరాస్ సాయిలు అన్నారు. మంగళవారం మండలంలోని మేనూర్ గ్రామంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయం మేరకు ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం ఆనవాయితీ అని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళల పేరిట ఇందిరమ్మ ఇళ్లు, పొదుపు సంఘాలలో సభ్యులకు వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు యూనిఫాంలు కుట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ, నాయకులు హనుమాండ్లు స్వామి, సంగయ్యప్ప ఉన్నారు.

పట్టుబడిన ఇసుక వేలం


డోంగ్లి మండలంలో ఇసుక వేలం వేస్తున్న అధికారులు

మద్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా రవాణా చేస్తూ పట్టుబడిన ఇసుకను మంగళవారం డోంగ్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలం పాటలో లింబూర్ గ్రామానికి చెందిన పటాన్ హబీబ్ ఖాన్ రూ.50,100 వేలంలో దక్కించుకున్నట్లు ఆర్ఐ సాయిబాబా వెల్లడించారు. ఈ వేలం పాటలో మద్నూర్, డోంగ్లి మండల ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని నిరసన


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న యువకుడు

బీర్కూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగ్ ఏడ్గి గ్రామానికి చెందిన బెల్కొని రవి తమ గ్రామంలో రోడ్డు పనులు చేపట్టడం లేదని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బరంగ్ ఏడ్గి దాబా నుంచి గ్రామం లోపలి వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. దీంతో గ్రామ ప్రజలు గుంతల్లో పడి తీవ్రంగా గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో వసతుల కల్పనకు కృషి చేస్తా


ఆలయ స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లోని పెద్దమ్మ ఆలయంలో వసతుల కల్పనకు తవనంతు కృషి చేస్తానని డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్‌లోని పెద్దమ్మ తల్లి మందిరానికి తన సొంత నిధులతో నిర్మించిన స్వాగత తోరణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతుల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు భక్తిబావంతో కలిగి ఉంటు ప్రతీరోజు తమ ఇష్టదైవాన్ని కొలిస్తే మనశాంతి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

జోరందుకున్న ఊరు పోరు



▸▸ మద్నూర్ మండలంలో ఇప్పటికే ప్రధాన పార్టీల సమావేశాలు పూర్తి

మద్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో పంచాయతీ పోరు వేడెక్కుతుంది. తాజాగా వచ్చిన రిజర్వేషన్లతో గ్రామ రాజకీయాలు కొత్త మలుపులు తిరిగాయి. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని 21 గ్రామ పంచాయితీలలో 11 జనరల్ రాగా ఐదు స్థానాలు బీసీలకు, మరో 5 ఎస్సీలకు కేటాయించారు. డోంగ్లి మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో ఏడు స్థానాల్లో జనరల్, మూడు స్థానాలను బీసీలకు కేటాయించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ సమావేశాలు పూర్తి..

ఉమ్మడి మద్నూర్ మండలంలోని మద్నూర్, డోంగ్లి మండలాల్లో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశాలు నిర్వహిం చి దిశానిర్దేశం చేశారు. దీంతో ఆయా పార్టీల నాయకులు క్షేత్రస్థాయిలో పరోక్ష ప్రచారం మొదలుపెట్టారు. బీజేపీ నుంచి ఎంపీ బీబీపాటిల్, మాజీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార సైతం క్షేత్రస్థాయిలో స్థానాలు గెలుపొందేలా కార్యకర్తలను ఉత్సాహ పరుస్తున్నారు. ఇక గతంలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా సేవలందించిన గంగారాం ప్రస్తుతం బీజేపీలో చేరడం కొంతవరకు బీజేపీకి కలిసివచ్చే అంశమే. ఆయన వర్గం ఎంతో కొంత తోడ్పాటునందిస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

గెలుపే లక్ష్యంగా..

ప్రభుత్వం ఏకగ్రీవ సర్పంచులను ఎన్నుకుంటే రూ.10 లక్షల నజరానా ఇస్తామని ప్రకటించ డంతో ఆయా గ్రామాలలో ముఖ్యమైన వారితో సమావేశాలు నిర్వహించి ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నుకునేలా ప్రయత్నాలు ముమ్మరంగా జరుగు తున్నాయి. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రస్తుతం విదేశాల్లో ఉండటంతో ఆ పార్టీ నాయకులు ఆయా గ్రామాలలో తిరిగి కార్యకర్తలకు ఉత్తేజ పరుస్తున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి రాబోయే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ సర్పంచ్ స్థానాలు గెలుచుకోవాలని నిర్దేశం చేశారు. గతంలో ఏకగ్రీ వంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచులు ఆయా గ్రామాల్లో మళ్లీ ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నా లను ముమ్మరంగా చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన తొలగింపుతో అనేకమందికి మళ్లీ అవకాశాలు లభించాయి. ఇన్ని రోజులు జెండా పట్టుకొని నేతలను గెలిపించడం నాయకులను కార్యకర్త లను సమన్వయం చేయడంలో మునిగిన వారికి ఇప్పుడు పోటీ చేసే అవకాశం రావడంతో గ్రామాల్లో ఆశావహుల సంఖ్య పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీల నుంచి పోటీలో నిలబెట్టే అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


దీక్షిత

జక్రాన్‌పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్- 14 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు కలిగోట్, పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏ.నిత్యశ్రీ, పి.రోహిత్, దీక్షిత ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాస్, యాదగిరి మంగళవారం తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటా రని తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్త మ చారి, సురేందర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యా యులు యాదగిరి, శ్రీనివాస్, ఆ గ్రామాల వీడీసీ సభ్యులు అభినందించారు.

ఆర్మూర్: ఆ ర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయురాలు హరిత, వ్యాయామ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన హిమప్రియ, రిషిక, ప్రణీత రాష్ట్రస్థా యి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి పెద్దపల్లిలో జరగ నున్న పోటీలలో వీరు పాల్గొంటారన్నారు.

ముప్కాల్: బాల్కొండ ఆదర్శ పాఠశాల విద్యార్థి హర్షిత్ అండర్- 14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపి కైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు ముత్తెన్న తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీ లలో హర్షిత్ పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కలిగోట్ విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎమ్ పురుషోత్తమాచారి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మగ్గిడి పాఠశాల విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం హరిత

వివేకానంద విగ్రహావిష్కరణ


వివేకానంద విగ్రహావిష్కరణలో పాల్గొన్న యూత్ సభ్యులు, నాయకులు

ఏర్గట్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం స్వామి వివేకానంద విగ్రహాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి ఆవిష్కరించారు. విగ్రహదాత జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ మాట్లాడుతూ.. ఏర్గట్ల మండలంలోని యువజన సంఘాల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, స్వామి వివేకానంద స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, దండెవోయిన సాయికుమార్, మునిమానిక్యం అజయ్, గ్రామంలోని యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నగర అధ్యక్షుడికి సన్మానం


రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

జక్రాన్‌పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొబ్బిలి రామకృష్ణను మంగళవారం జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం బొబ్బిలి రామకృష్ణను శాలువతో సత్కరించారు. పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు స్వామి, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అభిలాష్, ఉపాధ్యక్షుడు ప్రణయ్ పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి కుటుంబం చెంతకు


కుటుంబసభ్యులతో బుక్యా ఈశ్వర్

కమ్మర్‌పల్లి, నవంబరు: 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాసకొత్తూర్‌కు చెందిన గిరిజన యువకుడు బుక్యా ఈశ్వర్ నెలక్రితం కువైట్‌లో అదృశ్యమవగా ఎట్టకేలకు సోమవారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఉపాధి నిమిత్తం కువైట్‌లో పనిచేస్తున్న ఈశ్వర్ ఇంటికి వస్తున్నట్లు మొదట కుటుంబీకులకు సమాచారం అందింది. ఆ తర్వాత ఇంటికి రాకపోవడంతో అతడి భార్య సుగుణ, కుటుంబీకులు ఈ నెల 11న గ్రామానికి చెందిన కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్ కుమార్ సహకారంతో హైదరాబాద్‌లోని ప్రవాస ప్రజావాణి ఇన్‌చార్జ్ ప్రణాలిక సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ భీమ్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై కువైట్‌లోని ఎంబసీ అధికారులతో మాట్లాడగా ఈశ్వర్ అక్కడి పోలీసుల ఆధీనంలో ఉన్నట్లు గుర్తించి అక్కడి అధికారులతో మాట్లాడి ఈశ్వర్ మతిసరిగాలేకపోవడంతో తప్పిపోయినట్లు చెప్పి ఎట్టకేలకు స్వదేశం రప్పించారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడి ఎన్నిక



తాడ్వాయి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఆకిటి రవీందర్ రెడ్డిని నియమించినట్లు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బిక్షంగౌడ్‌ను నియమించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులకు, ఉపాధ్యాయులకు ఆకిటి రవీందర్ ధన్య వాదాలు తెలిపారు.


ఆలూర్‌లో మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

వందశాతం సబ్సిడీతో గంగపుత్రులకు చేపపిల్లల పంపిణీ

ఆలూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలోని అన్ని గ్రామాలకు గంగపుత్రుల అభ్యున్నతే లక్ష్యంగా చేసుకొని చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, నాయకుల ఆధ్వరంలో నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలకు వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జీవన అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చేపల పెంపకం ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం కావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో చేప పిల్లలను వదిలి ఉత్పాదకతను పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బోనాల ఉత్సవాలు

- హాజరైన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నందిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుకా మాత ఏల్లమ్మ బోనాల పండుగ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మూడు రోజులుగా ప్రతీ రోజు గౌడ కులస్తులు డప్పు వాయిద్యాలతో బోనాల ఊరేగింపులు నిర్వహించారు. చివరి రోజు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బోనాల ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బోనాల పండుగను పెద్ద ఎత్తున్న నిర్వహించిన గౌడ సంఘం ప్రతినిధులను, సభ్యులను అభినందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో జరిగింది. వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


నందిపేటలో బోనాలను ఊరేగిస్తున్న గౌడ కులస్థులు

బాన్సువాడ నుంచి కామారెడ్డికి డీలక్స్ బస్సు ప్రారంభం

బాన్సువాడటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నుంచి కామారెడ్డికి కొత్తగా డీలక్స్ బస్సు సర్వీసును ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. ఈ సర్వీసు బాన్సువాడ నుంచి ఉదయం 5.15 గంటలకు, 9.00 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరుతుందన్నారు. తిరిగి కామారెడ్డి నుంచి బాన్సువాడకు ఉదయం 7.15 గంటలకు, 10.45 గంటలకు, మధ్యాహ్నం 2.15 గంటలకు, సాయంత్రం 6 గంటలకు వస్తుందన్నారు.

5వ రోజు డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

సుభాష్‌నగర్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో 5వ రోజు డిగ్రీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1వ, 3వ, 5వ, 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు 30 పరీక్షా కేంద్రాలలో నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 5786 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 5537 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 5070 మంది హాజరుకావాల్సి ఉండగా 4618 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు.

టీజీఎన్‌పీడీసీఎల్‌లో ఏఈల బదిలీలు

సుభాష్‌నగర్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో బదిలీల పరంపర కొనసాగుతుంది. 2 రోజులుగా ఎస్ఈ, డీఈ, ఏడీఈలను బదిలీ చేస్తూ వరంగల్ సీఎండీ కార్నాటి వాసు ఉత్తర్వులు జారీచేశారు. తాజాగా ఏఈలను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. మోపాల్ ఏఈగా పనిచేస్తున్న నాగ శర్వాణి హెచ్‌టీ మీటర్స్ నిజామాబాద్‌కు బదిలీ చేశారు. దేగాం ఏఈగా పనిచేస్తున్న శ్రావణ్‌కు ఆర్మూర్ కన్‌స్ట్రక్షన్ ఏఈగా, పెర్కిట్ సబ్ డివిజన్‌లో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రూప్ సాయిని ధర్పల్లి ఏఈగా, నిజామాబాద్ ఎస్‌పీఎంలో పనిచేస్తున్న కాశీనాథ్‌ను నిజామాబాద్ కన్‌స్ట్రక్షన్ ఏఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఆధ్యాత్మికం

ఘనంగా ఎల్లమ్మ బోనాల పండుగ


బోనాల పండగలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

జక్రాన్‌పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగోట్ గ్రామంలో ఎన్ఆర్ఐ సత్యంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ బోనాల పండగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కు మార్ గౌడ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు డా.భూప తిరెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మానాల మోహన్‌రెడ్డి, రత్నాకర్ గౌడ్, గడుగు గంగాధర్, కేశ వేణు కలిసి వేర్వేరుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, గౌడ సంఘం సభ్యులు, కలిగోట్ గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు


మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

రుద్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో మంగళవారం గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక హనుమాన్ ఆలయం వద్ద గజ్జెలమ్మ రథాన్ని ముస్తాబు చేసి డప్పు వాయిద్యాలతో గజ్జెలమ్మ తల్లి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అంతకు ముందు గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు భక్తులు ఆయా గ్రామాల ప్రజలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం భక్తులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద పోతురాజుల విన్యాసాలు అలంరింపజేశాయి. గ్రామ కమిటీ అధ్యక్షుడు రెంజర్ల గంగారాం, కార్యదర్శి గంగలి రాములు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, రాము, గ్రామ పెద్దలు రాములు, మంత్రి గంగారాం, మహేష్, హన్మాండ్లు, గంగాధర్, పోచయ్య, సాయిలు, నరేందర్, గగన్, సుమన్ ఉన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నవీపేటలోని రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించారు. కృష్ణ, అరవింద్ రెడ్డి, గణేష్, రాజేందర్ గౌడ్, సంజీవ రెడ్డి, ఎన్ఎన్ రెడ్డి, కాంతం రెడ్డి, రాము, నవీన్ తదితరులున్నారు.

అర్గుల్‌లో అగ్గిమల్లన్న జాతర

జక్రాన్‌పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో మంగళవారం అగ్గిమల్లన్న జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం శ్రీ అగ్గిమల్లన్న పల్లకీ సేవను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులు మల్లన్న స్వామి పల్లకీకి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం మల్లన్న సిరి రథోత్సవం, జాతర, అన్నదాన కార్యక్రమం జరగనుంది. గురువారం అగ్నిగుండం, ఎల్లమ్మ కథ కార్యక్రమం ఉంటుందన్నారు. యాదవ సంఘం నాయకులు సదానంద్, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి

తెలుగు జాతికి గర్వకారణం పంపాకవి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు ప్రాచీన హోదా దక్కడానికి కారణం పంపాకవి అని ఇతిహాస సంకలన సమితి ఇందూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు జాతి గొప్పతనాన్ని తెలియజేస్తూ విక్రమార్జున విజయం అనే గ్రంథాన్ని బోధన్ చాళుక్యరాజు అయిన రెండవ హరికేసరికి అర్పించిన అత్యంత పవిత్రమైన రోజు మార్గశిర శుక్లపంచమి అని అన్నారు. పంపాకవి గొప్పతనాన్ని తెలియజేస్తూ కరీంనగర్ జిల్లా కురిక్యాల ప్రాంతంలో శాసనాల ద్వారా తెలుస్తుందన్నారు. ప్రభుత్వం చరిత్రను పంపాకవి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు పరిచయం చేయడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. త్వరలోనే ఇందూరు జిల్లా పూర్తి వాస్తవమైన చరిత్రతో కూడిన గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు మోహన్‌దాస్, వెంకటమల్లయ్య, విశ్వజిత్ పాల్గొన్నారు.

సొంత భవనంలోకి పోలీసు స్టేషన్

నిజామాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రూరల్ పోలీసు స్టేషన్‌కు వైభవం రానుంది. పదేళ్లుగా ఇరుకైన అద్దె గదుల్లో ఉన్న రూరల్ పోలీసు స్టేషన్ బుధవారం సొంత భవనంలోకి మారనుంది. 2014లో పాత భవనాన్ని కూల్చి దాని స్థానంలో కొత్త భవనం నిర్మించేందుకు పోలీసు హౌజింగ్ సొసైటీ ప్రతిపాదనలు పంపింది. వెంటనే పాత భవనాన్ని కూల్చివేశారు. వెంటనే హౌసింగ్ బోర్డు కాలనీలో ఒక క్వార్టర్స్‌ను అద్దెకు తీసుకుని అందులోకి మార్చారు. కేవలం రెండు గదులుండే ఆ ఇంట్లోనే పదేళ్లుగా పోలీసు స్టేషన్ కార్యకలాపాలు నెట్టుకొచ్చారు. సీజ్ చేసిన వాహనాలు, కేసుల్లో పట్టుబడ్డ బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలు ఇప్పటి వరకు రోడ్డుమీదనే నిలిపి ఉంచేవారు. ఇందులో కొన్ని బైక్‌లు దొంగతనానికి గురయ్యాయి కూడా. ప్రస్తుతం విశాలమైన స్థలంలో రూరల్ పోలీసు స్టేషన్, సీఐ కార్యాలయం కూడా ఏర్పాటుచేశారు. బుధవారం కొత్త భవనంలోకి మారుతున్నామని, అందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వారం తర్వాత పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా ప్రారంభించనున్నట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



హన్మండ్లు



నారాయణ

ఇందూరు, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): ఆల్ పెన్షనర్స్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సిర్ప హన్మండ్లు, ఈవీఎల్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఆల్ పెన్షనర్స్ భవనంలో మంగళవారం ఏర్పాటుచేసిన 3వ మహాసభలో కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రామ్మోహన్‌రావు, కోశాధికారిగా వీరయ్య, ఉపాధ్యక్షులుగా పుష్పవల్లి, అమినుద్దిన్, ప్రసాద్‌రావు, జార్జి, పురుశోత్తంరాబు, గంగాధర్, బాబగౌడ్, కార్యదర్శులుగా కృష్ణారావు, ప్రేమలత, లింగయ్య, సృజన, రామ్‌చందర్, మధుసూధన్, నాగేశ్వర్‌రావు, బోజారావు, పాండురంగం ఉన్నారు.

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కాంగ్రెస్

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

మోపాల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రాణత్యాగం చేసిందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని న్యాల్‌కల్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంగళవారం 30 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరికి రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావులు మాత్రమే రాష్ట్రాన్ని దోచుకున్నారని అన్నారు. 23కోట్ల రూపాయలను డ్వాక్రా గ్రూపుల మహిళలకు వడ్డీలేని రుణాలుగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్‌ను బీజేపీ నాయకులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషిచేస్తున్నాం

నిజామాబాద్ రూరల్: తెలంగాణలోని మహిళలను మహరాణులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం గుండారంలో మహిళా సమాఖ్య సభ్యులకు రూ.2 కోట్ల వడ్డీ రాయితీ చెక్కును అందజేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు సైతం మహిళల పేరుతోనే ఇస్తుందని తెలిపారు. మహిళా సమాఖ్య సభ్యులు ఆర్టీసీ బస్సులు సైతం నిర్వహించుకోవచ్చని, గోదాంలు వంటి వాటిని కూడా నిర్వహించుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు.

నిజామాబాద్ రూరల్: తన నియోజకవర్గంలో సొంత ఇల్లు లేని వారు ఉండవద్దని, అందరికీ ఇళ్లు వచ్చేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం రూరల్ మండలం పాల్దాలో నూతనంగా నిర్మించిన 24 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీచేశారు. పాఠశాలకు గోడ నిర్మిస్తానని, రోడ్ల మరమ్మతులకు కూడా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. పాల్దా రైతులకు పొలాలకు వెళ్లేందుకు చెక్‌డ్యాంపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పాల్దా కాంగ్రెస్ నాయకులు జనార్దన్, శ్రీకాంత్, మోహన్, భాగారెడ్డి, శ్రీధర్, కోర్వ గంగాధర్, భోజన్న, నగేష్, క్యాతం హనుమాండ్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉప కమిషనర్ యాదయ్య

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఉప కార్మిక కమిషనర్ యాదయ్య సూచించారు. జిల్లాలోని భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా నవంబరు 24 నుంచి డిసెంబరు 3 వరకు అవగాహన సదస్సులు నిర్వహి స్తున్నట్లు ఉప కార్మిక కమిషనర్ యాదయ్య తెలిపారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు పోస్టర్‌లను జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్థియాన్ మావితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఉప కార్మిక కమిషనర్ యాదయ్య మాట్లాడుతూ .. భవన, నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రమాద మరణ సహాయం రూ.10లక్షలు, సహజమరణం రూ.2లక్షలు, అంగవైకల్యం రూ.5లక్షలు, పెళ్లి కానుక రూ.30వేలు, ప్రసూతి సమయం రూ.30వేలు, ఆసుపత్రిలో వైద్యం కోసం ప్రతిరోజు రూ.300ల చొప్పున సంక్షేమ బోర్డులో నమోదు కాని కార్మికులకు మరణ సహాయం రూ.50వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్‌భారత్ సంవత్సరం వరకు రూ.5లక్షలు అందిస్తున్నట్లు వివరించారు.



ధర్మపురి సంజయ్‌ని సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

» మాజీ మేయర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు సంజయ్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోటగల్లిలో కొలువుదీరిన లక్ష్మీనర్సింహస్వామిని మంగళవారం మాజీ మేయర్, జిల్లా మున్నూరుకాపు సంఘ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ దర్శించుకున్నారు. ఆలయ 8వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన విశ్వక్‌సేన, పుణ్యాహవచన, కళ్యాణం, సుదర్శన హోమం, పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలంతా పాడిపంటలతో ఆయురారోగ్యంతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు సంజయ్ తెలిపారు. అనంతరం కోటగల్లి సుగంధం మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్టీసీ గంగాధర్, శ్రీనివాస్, గంగన్న, వినయ్, శ్రీనివాస్, రమణ, శివకుమార్, రాజు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బల్దియా కమిషనర్‌గా అంకిత్

నిజామాబాద్ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అడిషనల్ కమిషనర్ అంకిత్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం అడిషన్ కలెక్టర్ చాంబర్‌లో చార్జి తీసుకున్నారు. అడిషన్ కమిషనర్ రవీంద్రసాగర్ బల్దియాలో జరుగుతున్న అభివృది పనులను ఆయనకు వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు, పెండింగ్ పనులను ఇన్‌చార్జి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇకపై బల్దియా ఇన్‌చార్జి కమిషనర్‌గా అంకిత్ కొనసాగనున్నారు.

బయో మైనింగ్ పరిశీలన

నిజామాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగర శివారులో రంలోని డంపింగ్‌యార్డును డిప్యూటీ కమిషనర్ రవిబాబు పరిశీలించారు. మంగళవారం ఉదయం డంపింగ్‌యార్డును పరిశీలించి తడిచెత్త-పొడిచెత్త వేరుచేసే ప్రక్రియను గురించి ఆరా తీశారు. యార్డులోని బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలించారు. చెత్త వేరుచేసే ప్రక్రియను వేగవంతం చేయాలని డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి ప్రభుదాస్‌కు సూచించారు. నగరంలో పారిశుధ్య సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బయోమైనింగ్ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం చూపకూడదని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

సిరికొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులను గౌడ సంఘ సభ్యులు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులతో పాటు వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరికొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామంలో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. దొన్పల్లి బుచ్చవ్వ, నిహారిక, బాలగౌడ్, నర్సాగౌడ్‌లకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బుచ్చన్న మాజీ సర్పంచ్ గౌసొద్దీన్, వీడీసీ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, శ్రీధర్, రాజేశ్వర్, రహీం పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా రూప్‌సాయి

ధర్పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల ట్రాన్స్‌కో ఏఈగా రూప్‌సాయి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన నాగేశ్వర్ పదోన్నతిపై మోర్తాడ్‌కు వెళ్లారు. ఏఈగా బాధ్యతలు స్వీకరించిన రూప్‌సాయి మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు గృహ అవసరాల వినియోగదారులకు ఎలాంటి ఇబ్బం దులు ఎదురు కాకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించి గృహ అవసరాల బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు.

అనాథశవానికి అంత్యక్రియలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనాథ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దేవిథియేటర్ వద్దగల సార్వజనిక్ స్మశాన వాటికలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాయిబాబు, 1వ టౌన్ పోలీస్ సిబ్బంది రాజ్‌గోపాల్‌తో కలిసి దహన సంస్కారాలు నిర్వహించారు.సదాశివ, పురుషోత్తం రెడ్డి, నరేష్‌రెడ్డి ఉన్నారు.

దీక్షా దివస్‌పై బీఆర్ఎస్ సమావేశం

సుభాష్‌నగర్,నవంబరు25, (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిర్వహించనున్న దీక్ష దివస్‌పై బుధవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్‌గుప్త, షకీల్, మాజీ ఎమ్మెల్సీ వీజిగౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావుతో పాటు తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.



శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



సంగీత కచేరి చేస్తున్న విద్యార్థినులు

కళార్చన

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంగీత నృత్య కళాప్రదర్శనతో కళార్చన సాగింది. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల జ్ఞానసరస్వతి ప్రభుత్వ పాఠశాలలో నెలవారీ కార్యక్రమమైన కళార్చన మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నెలరోజులపాటు నేర్చుకున్న విద్యను వేదికపై ప్రదర్శించారు. హిందుస్థాని గాత్ర అధ్యాపకురాలు అనిత శిష్యులు, కర్నాటక గాత్ర అధ్యాపకురాలు స్వప్నరాణి శిష్యులు గాత్రంతో తమ ప్రతిభను ప్రదర్శించగా రవీందర్‌రాజు కూచిపూడి నృత్యం, సంతోష్ శిష్యులు పేరిని నృత్యంతో ప్రతిభను చూపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్‌రాజు మాట్లాడుతూ.. ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించడంతో పాటు సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రసాద్, పద్మావతి, భరత్, నంద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నార్కోటిక్ అధికారి శ్రీకాంత్

మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన

సుభాష్‌నగర్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల వినియోగం, వినియోగానికి పాల్పడితే పడే శిక్షలపై పాలిటెక్నిక్ కళాశాలలో నార్కోటిక్ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నార్కోటిక్ విభాగ అధికారి శ్రీకాంత్ హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం, యువత వ్యసనానికి అలవాటు కాకూడదని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ.. ఆరోగ్యమైన జీవన విధానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీల మౌనం

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికి స్థానిక ఎన్నికలపై బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచి జోష్‌మీదున్న కాంగ్రెస్ జిల్లాలో మెజార్టీ స్థానిక సంస్థల స్థానాలను గెలుచుకునేందుకు ఉత్సాహంగా ఉండగా, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఇటీవల గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీలను గెలిచిన బీజేపీ సైతం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీలు మాత్రం నియోజకవర్గాలకు దూరంగా ఉండడంతో పార్టీ క్యాడర్‌లో అయోమయ పరిస్థితి నెలకొంది. బాన్సువాడ ఉప ఎన్నిక వస్తుందనే ప్రచారం నేపథ్యంలో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బాన్సువాడపై దృష్టిపెట్టి అడపదడపా రూరల్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. నిజామాబాద్ అర్బన్, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో మాత్రం మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

సైబర్ నేరగాళ్ల వేధింపులే అధికం

(5వ పేజీ తరువాయి)

అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య మాట్లాడారు. ప్రస్తుత ఏఐ యుగంలో ఏది అబద్ధమో, ఏది నిజమో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సఖీ వన్‌స్టాప్ ఏర్పడిననాటి నుంచి 8 సంవత్సరాలుగా ధనిక, పేద లేకుండా ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ అరుణ డాక్టర్, సఖి వన్ స్టాప్ సెంటర్ ఏవో భానుప్రియ, తదితరులున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గసభ్యులు జిల్లా కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డిని కలిశారు. మంగళవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచం ఇచ్చి అభినందించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని కోరగా.. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పండరినాథ్, ప్రధాన కార్యదర్శి గంగాకిషన్, ఆర్థిక కార్యదర్శి రవీందర్‌రెడ్డి, జీఎం శంకర్, జాయింట్ సెక్రెటరీ శంకర్, కుమారస్వామి, ప్రచార కార్యదర్శి రాజప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్, రాష్ట్ర కౌన్సిలర్ రాకేష్ చంద్ర, తాలూకా కార్యదర్శి దయాకర్, ఆర్థిక కార్యదర్శి ఉపాధ్యక్షుడు రంగప్రకాష్, గంగాదర్ ఉన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రిటైర్డు ఉద్యోగులు

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

నిజామాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో శునకాలు నగరవాసులను హడలెత్తిస్తున్నాయి. ఇప్పటివరకు స్తబ్దంగా ఉన్న కుక్కలు ఇటీవల నగరవాసులను భయపెడుతున్నాయి. గత రెండు రోజులుగా నగరంలోని పలు కాలనీల్లో స్థానికులకు కరిచాయి. రోడ్డుగుండా వెళ్తున్న మహిళలు, చిన్నారులను సైతం కరిచినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం రాత్రి, మంగళవారం నగరంలోని మాలపల్లి, గాంధీచౌక్, వీక్లీబజార్, ఎక్‌మినార్, నెహ్రూపార్కు, ఆటోనగర్ లలో కుక్కలు పదుల సంఖ్యలో కరిచాయి. వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సీన్‌ను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వేయించుకున్నారు. కుక్కల పట్టుకునేందుకు రాత్రివేళ స్పెషల్ టీమ్‌లను పంపుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాల్మన్ రాజు తెలిపారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పం

(5వ పేజీ తరువాయి)

ఈ మేరకు మహిళా సమాఖ్యకు కలెక్టర్ లాంఛనంగా చెక్కును పంపిణీ చేశారు. నల్గొండ తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాకు వడ్డీ లేని రుణాల కింద ప్రభుత్వం రూ.23.26కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. మహిళల గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా ప్రభుత్వం 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తోందని, మహిళ సంఘాల సభ్యులకు ఇంటి నిర్మాణం కోసం రుణాలను కూడా అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో రూ.67కోట్ల రుణాలు అందజేశామని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్, డీపీఎం రాచయ్య, తదితరులున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

విద్యను కాషాయీకరిస్తున్న మోదీ ప్రభుత్వం

(5వ పేజీ తరువాయి)

ఉద్యమ నిర్మాతలు కామ్రేడ్ జార్జిరెడ్డి జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ అమరత్వాన్ని ఎత్తిపెడుతూ వారి ఆశయబాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ పోరాడుతుందన్నారు. అంతకముందు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానం నుంచి రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు వేలాది మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభ వద్ద పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ జెండాను ఆవిష్కరించారు.

ఇసుక నిల్వల స్వాధీనం

ధర్పల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరప్ప తాండా వాగు నుంచి అక్రమంగా ఇసుకను డంప్ చేసి తరలించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో కళ్యాణి మంగళవారం తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు లావుడ్య శ్రీనివాస్, బూక్యబాలు, దరావత్ సంతోష్, రవిగుప్త, బాలయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

సినిమా గైడ్

దేవి	: రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: ప్రేమంటే (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: సీసురోడ్ ఆఫ్ రివేంజ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కల్కి వనం (10.45)
	: 12 ఏ రైల్వే కాలని (1.30, 7.30, 10.20)
	: పాంచ్ మినార్ (4.30)
స్క్రీన్-2	: రాజు వెడ్స్ రాంబాయి (11.00)
	: ప్రేమంటే (1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-3	: ది గర్ల్‌ఫ్రెండ్ (1.45, 7.30)
	: రాజు వెడ్స్ రాంబాయి (4.30, 10.20)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: 12 ఏ రైల్వే కాలని (10.55, 4.40, 10.20)
	: విక్డ్ ఫర్ గుడ్ (ఇంగ్లీష్ 3డి) (1.40, 7.20)
స్క్రీన్-2	: 120 బహద్దూర్ (హిందీ) (11.00, 4.55, 10.50)
	: ప్రేమంటే (2.00, 7.55)
స్క్రీన్-3	: సిస్సు రోడ్ టూ రివేంజ్ (12.20, 5.20)
	: ఇట్లు మీ వెధవ (2.30) : పాంచ్ మినార్ (7.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (10.20)
స్క్రీన్-4	: మస్తి-4 (హిందీ) (11.05, 7.40)
	: రాజు వెడ్స్ రాంబాయి (2.10)
	: కల్కి వనం (5.00) : దేదే ప్యార్‌దే-2 (హిందీ) (10.45)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,27,500	రూ.1,17,625	రూ.1660

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.270	రూ. 290

